మెట్రో ఛార్జీల పెంపును విరమించుకోవాలి

- నష్టాల పేరుతో చార్జీలు పెంచడం సరికాదు
- ఇప్పటికే ఆర్‌టిసి బస్సులు, ఎంఎంటిఎస్ రైళ్లను తగ్గించారు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రో చార్జీల పెంపు ఆలోచనను విరమించుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయం మార్క్స్ భవన్‌లో ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్ అధ్యక్షతన బుధవారం వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో జీవనానికి సరిపడా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో శ్రమజీవులు, కార్మికులు, వేతన జీవులు నగరానికి వలస వస్తున్నారని తెలిపారు. వారు ఉండే నివాసానికి పని స్థలాలకు చాలా దూరం ఉంటుందన్నారు. ఈ స్థితిలో ప్రభుత్వం రవాణా వ్యవస్థను సులభతరం చేయాలి కానీ దానికి విరుద్ధంగా ప్రవర్తిస్తోందని అన్నారు. కరోనా తర్వాత ఆర్టీసీ బస్సులను కుదించారని, ఎంఎంటీఎస్‌లను విపరీతంగా తగ్గించారని చెప్పారు. దాంతో ప్రజలు అనివార్యంగా మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్నారన్నారు. మెట్రోలో ప్రస్తుతమే చార్జీలు ఎక్కువగా ఉన్నాయని, మళ్లీ ఎల్అండ్‌టీ సంస్థ చార్జీలు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. కరోనాలో నష్టం చేకూరి ఉండొచ్చని, ఇది యావత్ ప్రపంచం అనుభవించిందని అన్నారు. దాని పేరుతో నష్టాలు ఉన్నాయని చార్జీలు పెంచాలనుకోవడం సమంజసం కాదన్నారు.

సిపిఐ నగర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. 25 నుంచి 30 శాతం చార్జీలు పెంచాలని.. అందులో భాగంగా మినిమం చార్జీలు రూ.10 నుంచి 15 రూపాయలు చేయాలని, రూ.55 ఉన్న దాన్ని 75కు పెంచాలని, ఆ రీత్యా ఏటా రూ.150 నుంచి రూ.175 కోట్లు వసూలు చేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. మెట్రో చార్జీల పేరు మీద ప్రయాణికులు మూడు నాలుగు వేలు, పార్కింగ్‌కు ఐదారు వందలు, అటు నుంచి ఆటో, బస్సులకు మరొక ఐదారు వందలు కలిపి మొత్తంగా నెలకు నాలుగైదు వేల రూపాయలు రవాణాకే పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వం మెట్రో సంస్థకు ఎట్టి పరిస్థితుల్లోనూ చార్జీల పెంపునకు అనుమతి ఇవ్వకూడదన్నారు. న్యూ డెమోక్రసీ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.ఝాన్సీ మాట్లాడుతూ.. మెట్రో పార్కింగ్ ఉచితంగా కల్పించాలని, ప్రయాణికులకు ఉచిత టాయిలెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. విపరీత రద్దీ నేపథ్యంలో మెట్రో రైళ్లలో అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. చార్జీల ప్రతిపాదనలను ఉపసంహరించుకోకపోతే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ సెక్రటేరియట్ సభ్యులు ఎస్ఎల్ పద్మ, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్.ప్రదీప్, ఎస్‌యుసిఐ నగర నాయకులు విజయ్, టియుసిఐ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి వి.ప్రవీణ్, పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షకార్యదర్శులు రవి, కృష్ణ పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాలు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం ఘటనకు ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. బుధవారం ఎయిర్‌పోర్టు నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాలను మధ్యాహ్నం 12 గంటల నుంచి రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రధానంగా జమ్ము, శ్రీనగర్, లేహ్, జోద్పూర్, అమృత్‌సర్, బుజ్, జాంనగర్, ఛండీఘర్, రాజ్‌కోట్‌కు వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేశారు. దీంతోపాటు రెండు అంతర్జాతీయ విమానాలను దారి మళ్లించారు.

శంషాబాద్‌లో మాక్ డ్రిల్

ఉద్రిక్తత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ సూచించారు. ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ శంషాబాద్ జోన్ డిసిపి ఆధ్వర్యంలో సాయంత్రం బస్ స్టేషన్ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రదాడి జరిగినప్పుడు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. అలాగే ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగ్లూర్ ఎక్స్ రోడ్డు, వండర్‌లా, రావిర్యాల, తుర్కయంజాల్‌లో ఆదిబట్ల పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు.

సైన్యానికి అండగా ఉందాం

- ఈ సమయంలో రాజకీయాలకు, పార్టీలకు తావు లేదు
- అత్యవసర విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు
- మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలి
- రక్త, ఆహార నిల్వలను సిద్ధం చేయండి
- అసత్య వార్తలను అడ్డుకోవడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి
- 'ఆపరేషన్ సిందూర్'పై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనమందరం సైన్యానికి అండగా ఉందామంటూ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమయంలో రాజకీయాలకు, పార్టీలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డిజిపి జితేందర్, హోమ్ సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియా ప్రతినిధులతో కొద్ది సేపు మాట్లాడారు. దేశ సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇవ్వాలన్నారు. అత్యవసర సర్వీస్ లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేసినట్టు ప్రకటించారు. మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని కోరారు. రక్తం, ఆహారం, అత్యవసర ఔషధాల నిల్వలను సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అసత్య వార్తలను అడ్డుకునేందుకు వీలుగా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాంటి వార్తలను ప్రచారం చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అనవసరమైన ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఎం ఈ సందర్భంగా హెచ్చరించారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా వచ్చి రాష్ట్రంలో నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో బెడ్ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలనీ, రెడ్ క్రాస్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు.

ప్రజలు భయభ్రాంతులకు గురి కావొద్దనీ, అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏవైనా అనుమానాలుంటే వెంటనే పోలీసు విభాగానికి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. అసత్యవార్తల వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని సిఎం హెచ్చరించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానించాలని ఆయన ఆదేశించారు. అన్ని జిల్లా కేంద్రాలు, సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలన్నారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర, ఐటీ సంస్థల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలనీ, అవసరమైతే పీస్ కమిటీ లతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీట్ నేపథ్యం ఉన్నవారు, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

చీరలకు కూలి పెంచాలి

- పాలిస్టర్ వస్త్ర వ్యాపారుల సంఘం వద్ద కార్మికుల నిరసన
- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా సంఘాల చీరలకు సంబంధించి కూలి పెంచాలని డిమాండ్ చేస్తూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లలో పాలిస్టర్ వస్త్ర వ్యాపార సంఘం భవనం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్ మాట్లాడుతూ.. బతుకమ్మ చీరల కంటే ప్రస్తుతం పనిభారం పెరిగిందని, తగిన కూలి రావడం లేదని తెలిపారు. యజమానులు వార్పిన్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికుల కూలి నిర్ణయించాల్సిన అధికారులు యజమానులకే బాధ్యతలు అప్పగించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్మికుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు యజమానులకే లాభం చేకూరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పవర్‌లూమ్ కార్మికులకు సరైన కూలి నిర్ణయించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట గురువారం నిర్వహించే ధర్నాలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ అధ్యక్షులు సిరిమల్లె సత్యం, వైపని యూనియన్ అధ్యక్షులు కుమ్మరి కుంట కిషన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నేటి తరానికి ఒక ప్రతీక

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనులు తలెత్తుకుని బతుకుతున్నారంటే ఆ ధైర్యం పేరే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని, నేటి తరానికి ఆయన ఒక ప్రతీక అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మబంధువు అంబేద్కర్ అని కొనియాడారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నేపల్లి కూడలిలో ఏర్పాటుచేసిన 12 అడుగుల అంబేద్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని.. చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందరరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్యతో కలిసి స్పీకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. పట్టణ ముఖద్వారం ఎన్నేపల్లి చౌరస్తాలో బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా మన వికారాబాద్‌కు గౌరవం లభించిందని అన్నారు. విద్యా, ఉద్యోగాలు, రాజకీయ, సామాజిక రంగాల్లో తమ వాటాను పొందుతూ, ప్రజాప్రతినిధులు అవుతున్నామంటే దానికి కారణం అంబేద్కర్ అని తెలిపారు. తాను పడిన కష్టాలు, అనుభవించిన బాధలను భవిష్యత్తులో తన జాతి పడకూడదని అంబేద్కర్ రిజర్వేషన్లు అనే బ్రహ్మాస్త్రాన్ని మనకు ఇచ్చారన్నారు. ఆయన దారిలో నడిచి మనం ఉన్నత స్థానాలను అందుకోవాలని సూచించారు. అంబేద్కర్ ఒక కులానికో, మతానికో సంబంధించిన వారు కాదని, ఆయన ఈ దేశ ప్రజల ఆస్తి అని అన్నారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, ఎస్సీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.40,232 కోట్లు కేటాయించిందని తెలిపారు.

రాష్ట్రీయ రహదారిపై రైతుల ఆందోళన

- ఖమ్మంలో రోడ్డెక్కిన అన్నదాతలు.. భారీగా ట్రాఫిక్ జామ్
- ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని నినాదాలు
- రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఖమ్మం జిల్లా తల్లాడలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం-రాజమండ్రి రాష్ట్రీయ రహదారిపై బుధవారం రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులను కాపాడాలని, తడిసిన ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని, అధికారులు సంఘటనా స్థలానికి రావాలని నినాదాలు చేశారు. దాంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నాయకులను, రైతులను ఆందోళన విరమించే ప్రయత్నం చేశారు. ఒక దశలో తోపులాట జరిగింది. రాస్తారోకో విరమించే ప్రసక్తేలేదని, అధికారులు రావాలని భీష్మించి కూర్చొన్నారు. ఎట్టకేలకు తహసీల్దార్ వచ్చి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయిందని, ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణం కావడంతో రైతులు బోరుమంటున్నారన్నారు. తేమ శాతం అంటూ కొర్రీలు, సకాలంలో గన్ని సంచులు ఇవ్వాలని, ధాన్యం తరలించడానికి తగిన లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో జరుగుతున్న నిర్లక్ష్యం వల్లే పంట నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో కాటాలు వేసి తరలించకపోవడంతో రైతులకు ఈ పరిస్థితి ఉత్పన్నం అయిందన్నారు. ప్రతి గింజా కొంటాం అంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు నెల రోజులుగా మాయమాటలు చెప్పి, కార్యాచరణలో పూర్తిగా విఫలం అయ్యారని తెలిపారు. అధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు ఓపిక నశించి రాష్ట్రీయ రహదారిపై ఆందోళన చేపట్టామన్నారు. కాగా, ఆందోళన నిర్వహిస్తున్న రైతుల వద్దకు తహసీల్దార్ సురేష్ కుమార్ వచ్చి మాట్లాడారు. 20 వేల గన్నీ సంచులు, నాలుగు లారీలు పంపిస్తామని, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. హామీ నెరవేర్చకపోతే గురువారం మార్కెట్‌లో వంటావార్పు కార్యక్రమాన్ని చేపడతామని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, పులి కృష్ణయ్య, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, కట్టా దర్గయ్య, ఐలూరు చలపతి రెడ్డి, వేలూరు సత్యనారాయణ రెడ్డి, వర కిషోర్ రెడ్డి, జంగం కృష్ణారెడ్డి, అనుముల కృష్ణయ్య, కోలేటి ప్రసాద్, పగడాల కృష్ణారెడ్డి, కర్ణాటక కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై బైటాయించారు. 20 రోజుల క్రితం ఆగమేఘాల మీద పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా తూకం వేయక కాలయాపన చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని తహసీల్దార్ బాలలక్ష్మి హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయకుంటే..

కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడ్డట్టే

- ప్రతి మున్సిపల్ కార్మికునికి రూ.9వేలు పింఛన్ ఇవ్వాలి : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి అమలుచేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని, వాటిని రద్దు చేయకుంటే కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడ్డట్టే అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ప్రతి మున్సిపల్ కార్మికునికి 9 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అధ్యక్షతన మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కార్మికుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నదని అన్నారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు వారు పనిచేస్తున్న పరిధిలో సంఘాన్ని ఏర్పాటు చేసుకొని వారి సమస్యలను సాధించుకునేందుకు సమ్మె చేసే అవకాశాన్ని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సెక్షన్-సీ కల్పించిందని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ల ప్రకారం కార్మికులు సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం కానీ తమ హక్కుల కోసం పోరాటం చేయడం, పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సౌకర్యాల గురించి అడిగే హక్కును కోల్పోతారని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, కార్మికుల వేతనాలు.. సదరు కంపెనీ యజమాని దయ తలిస్తేనే ఉంటుందని అన్నారు. కాబట్టి ఈ నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, యూనియన్ జిల్లా అధ్యక్షులు కందారపు రాజనర్సు కార్మికులు పాల్గొన్నారు.

సైన్యానికి సంఘీభావంగా నేడు ర్యాలీ

- హాజరు కానున్న సిఎం, మంత్రులు

ప్రజాశక్తి- హైదరాబాద్‌బ్యూరో

భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్ వరకు జరిగే ఈ ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

విదేశీ పర్యాటకులకు భద్రత కల్పించాలి : సిఎం ఆదేశం

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో, తెలంగాణ పర్యటనకు వచ్చిన విదేశీ పర్యాటకులకు తగిన భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర నిఘా బృందాలతో సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర నిఘా బృందాలకు సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ కేంద్రంగా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు.

ఉద్రిక్తతల్లోనూ మార్కెట్లకు లాభాలు

ముంబయి : పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు నిర్వహించినప్పటికీ సెన్సెక్స్, నిఫ్టీలు సానుకూలంగా నమోదయ్యాయి. పాకిస్థాన్ ఈ సమస్యను మరింత జఠిలం చేయకపోవచ్చన్న అంచనాల్లో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ బుధవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైనప్పటికీ.. కాసేపట్లోనే లాభాల్లోకి వచ్చాయి. సెన్సెక్స్ 106 పాయింట్ల లాభంతో 80,747 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 34 పాయింట్లు పెరిగి 24,414 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, ఐటిసి, రిలయన్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరోవైపు భారత భద్రతా బలగాలు చేపట్టిన దాడుల కారణంగా పాక్ మార్కెట్లు మాత్రం కుప్పకూలాయి. కరాచీ 100 ఓ దశలో దాదాపు 6 శాతం నష్టంతో 6,272 పాయింట్లు పతనమైంది. ఆ తర్వాత కొంత కోలుకుని తుదకు 3470 పాయింట్లు లేదా 3.09 శాతం నష్టంతో ముగిసింది.

కోల్ ఇండియాకు రూ.9,593 కోట్ల లాభాలు

కోల్‌కతా : దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు కోల్ ఇండియా 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 12 శాతం వృద్ధితో రూ.9,593 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.8,530 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను తుది డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.5.15 చెల్లించడానికి కోల్ ఇండియా బోర్డు నిర్ణయించింది. ఎజిఎం తర్వాత ఈ మొత్తాన్ని 30 రోజుల్లో చెల్లించనుంది. గడిచిన క్యూ4లో కంపెనీ మొత్తం వ్యయాలు రూ29,057 కోట్లకు పెరిగాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.28,950 కోట్లుగా నమోదయ్యాయి. 2024-25లో మొత్తంగా 781.05 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. ఇంతక్రితం 2023-24లో 773.65 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగింది. బుధవారం ఎన్ఎస్ఇలో కోల్ ఇండియా షేర్ 1.6 శాతం పెరిగి రూ.384 వద్ద ముగిసింది.

విదేశీ ఇన్వెస్టర్లపై బంధన్ ఎఎంసి దృష్టి

న్యూఢిల్లీ : బంధన్ ఎఎంసి కొత్తగా గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ సందర్భంగా మూడు ఫండ్స్‌ను ఆవిష్కరించడంతో పాటుగా వాటిపై దృష్టి కేంద్రీకరించినట్లు ప్రకటించింది. ఇందులో బంధన్ ఇండియా లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ (ఐఎఫ్ఎస్‌సి), బంధన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్, బంధన్ ఇండియా గవర్నమెంట్ సెక్యూరిటీస్ ఫండ్ పథకాలున్నాయని వెల్లడించింది. వీటిల్లో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, విదేశీ సంస్థగత మదుపర్లు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్, ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు, పెన్షన్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎంఎఫ్ వృద్ధిలో భాగం అయ్యేలా చేయాలని నిర్దేశించుకున్నట్లు తెలిపింది.

సైనిక దళాల వెంటే ప్రజలు

- దేశ సమగ్రత, శాంతి సామరస్యతకు కలిసి నడుస్తాం
- ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా యుద్ధ పోరాటం చేస్తున్న భారత సైనిక దళాల వెంట రాష్ట్ర, దేశ ప్రజలంతా ఉన్నారని ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో బుధవారం కలిసి మంత్రి కొత్తూరు, నందిగామ మండలాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నందిగామ మండలంలోని చాకలిదానిగుట్ట తండాలో బస్టాండ్, చలివేంద్రాన్ని ప్రారంభించారు. నాట్కో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో చాకలిదానిగుట్టతండా, సంఘీగూడ, నందిగామలో అంగన్‌వాడీ భవనాలతోపాటు కొత్తూరు మండల కేంద్రంలో రూ.3కోట్లతో నిర్మించిన ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. దేశ సమగ్రత, శాంతి సామరస్యం విషయంలో భారత సైనిక దళాలు ప్రాణాన్ని లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఇది దేశ ప్రజలకు ఎంతో గర్వకారణమని చెప్పారు. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన భారత సైనిక దళాల పరాక్రమానికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. దేశంలో రాజకీయాల పరంగా, సిద్ధాంతాల పరంగా వేరైనా దేశ సమగ్రతను శాంతి సామరస్యాన్ని కాపాడటానికి కాంగ్రెస్ ముందుంటుందని అన్నారు. తమ నేత రాహుల్ గాంధీ భారత ప్రభుత్వానికి మద్దతు పలికారని తెలిపారు. విద్య, వైద్యానికి నాట్కో పరిశ్రమ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు తగిన ప్రణాళికతో ముందుకెళ్తున్నామని చెప్పారు. త్వరలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామన్నారు.

చేయి చాచలేదు.. తలదించలేదు.. : ఎమ్మెల్యే వీర్లపల్లి

నాట్కో పరిశ్రమ నిర్మించిన ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఏ పరిశ్రమ వద్ద నేను ఎప్పుడూ చేయి చాచలేదు.. తలదించలేదు' అని ఎమ్మెల్యే తన తల్లిపై ప్రమాణం చేసి మరీ చెప్పారు. ఈ కార్యక్రమంలో నాట్కో డైరెక్టర్ పిఎస్ఆర్‌కే ప్రసాద్, వైస్ చైర్మెన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మెన్ దోలి రవీందర్, డీఈఓ సుసింధర్‌రావు, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ లాభాల్లో పెరుగుదల

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ నికర లాభాలు 21 శాతం పెరిగి రూ.245 కోట్లుగా నపమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.202 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.692 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ4లో రూ.834 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.596 కోట్ల నుంచి రూ.722 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.08 శాతం నుంచి 1.05 శాతానికి తగ్గాయి.

లిఫ్ట్ మీద పడి ముగ్గురు కార్మికులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పవర్ ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం జరిగింది. లిఫ్ట్ తెగి కార్మికులపై పడటంతో ముగ్గురు మృతి చెందారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డంపింగ్ యార్డ్ పవర్ ప్రాజెక్టు పనుల్లో భాగంగా చిమ్ని అమరుస్తుండగా ఉదయం సుమారు 11 గంటల సమయంలో లిఫ్ట్ తెగిపోయి పనిచేస్తున్న కార్మికులపై పడింది. దాంతో కార్మికులు సురేష్ సర్కార్ (21), ప్రకాశ్ మండల్ (24), అమిత్ రాయ్ (20) తీవ్రంగా గాయపడ్డారు. శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. వారిని వెంటనే ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE (SPECIAL MOBILE COURT) VIZIANAGARAM
O.S. 348/2019 in I.A. 220/2020

Between:
Routhu Narasimhulu ..Petitioner/ Plaintiff
And:
Routhu Appalanaudu and others
......Respondents/ Defendants

To
R-6: T.V.R Estates & Resorts Pvt., Ltd., Reptd. By Sri. Kulukuloori Santhosh Kumar, S/o Satyanarayana Raju, aged 42 years, Resident of Door No. 6-3-841, Vithal Reddy Building, Indane Gas Compound, Amirpet, Hyderabad.

NOTICE

Take notice that the petitioner/plaintiff filed the above petition under Order I, Rule-10 of C.P.C., to add you as 6th defendant in the suit O.S. 348/2019 in which you are the 6th respondent and the said petition stands posted to 16-05-2025 for notice to you. If you got any objection in the above petition you can appear in person or through an advocate and file your objections if any on **16-05-2025 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the petitioner/plaintiff
Vizianagaram

తలసేమియాపై ఖమ్మంలో అవగాహన క్యాంపెయిన్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) ఆధ్వర్యంలో ఖమ్మంలో అవగాహన క్యాంపెయిన్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమంలో 15 మంది పిల్లలకు వారి ధైర్యం, విజయాలకు గుర్తింపుగా ఎక్సలెన్సీ అవార్డులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాల సమన్వయకర్తల అంకితభావ సేవలను గుర్తించి సన్మానించినట్లు టిఎస్‌సిఎస్ ఉపాధ్యక్షురాలు రత్నవలి కొట్టపల్లి పేర్కొన్నారు. ఈ సమస్యను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఎంపి రఘురామ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 250 మందికి పైగా రోగులు, వారి కుటుంబ సభ్యులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు పాల్గొన్నారు.

లెక్సస్ ఎల్‌ఎం 350 హెచ్‌కు మళ్లీ బుకింగ్స్

బెంగళూరు : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ లెక్సస్ ఇండియా తన లెక్సస్ ఎల్‌ఎం 350 హెచ్ మోడల్ కోసం మళ్లీ బుకింగ్స్‌ను తెరిచినట్లు ప్రకటించింది. అద్భుతమైన డిజైన్, ఆకట్టుకునే ప్రీమియం మోడల్స్‌గా ఉన్న తమ కార్లకు ఇండియాలో మంచి డిమాండ్ ఉందని ఆ సంస్థ పేర్కొంది. కొత్త లెక్సస్ మోడల్లకు 8 సంవత్సరాలు లేదా 1,60,000 కిలోమీటర్ల వాహన వారంటీని అందిస్తున్నట్లు తెలిపింది.

మానవాళి సమస్యలకు
ఏకైక పరిష్కారం మార్క్సిజం

- యుటిఎఫ్ వ్యవస్థాపకులు రావెళ్ల రాఘవయ్య సంస్మరణ సభలో తమ్మినేని
- ఆదర్శప్రాయుడు రాఘవయ్య : దుర్గాభవాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్త మానవాళి సమస్యలకు ఏకైక పరిష్కారం మార్క్సిజం మాత్రమేనని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మార్క్సిజం కోసం రాఘవయ్య తుదికంటా పోరాడారని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ అధ్యక్షతన నిర్వహించిన యుటిఎఫ్ వ్యవస్థాపకులు రావెళ్ల రాఘవయ్య సంస్మరణ సభలో తమ్మినేని మాట్లాడారు. ప్రపంచంలో ఏ సమస్యకైనా మార్క్సిజం మాత్రమే సమాధానం వెతికిందన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపటం కోసం రాఘవయ్య కృషి చేశారని తెలిపారు. వేలమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు యూటీఎఫ్ వ్యవస్థాపకులుగా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడారని రాఘవయ్య సేవలను కొనియాడారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తూ విద్యా కాషాయీకరణకు పాల్పడుతోందన్నారు. ఎన్‌ఈపీ పేరుతో విద్యారంగాన్ని బహుళ జాతి సంస్థలకు అప్పగిస్తుందన్నారు. ఉన్నత ఆదర్శాలను జీవితాంతం కొనసాగించిన మహానీయుడు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

రాఘవయ్య అని, ఆయనను ఆదర్శంగా తీసుకుని నేటితరం పనిచేయాలని పిలుపునిచ్చారు. రాఘవయ్య కుటుంబం మొత్తం వివిధ ప్రజాతంత్ర ఉద్యమాలకు అండగా నిలబడిందన్నారు. శ్రీనివాసనగర్‌లో గ్రంథాలయాన్ని నిర్మించి ప్రజలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు పాత్ర పోషించారని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని మాట్లాడుతూ.. సంఘం కోసం అనేక త్యాగాలు చేసిన ఆదర్శప్రాయుడు రావెళ్ల రాఘవయ్య అని చెప్పారు. అనేక నిర్బంధాలు ఎదుర్కొని సంఘాన్ని జిల్లాలో స్థాపించి, ఉపాధ్యాయులకు విశేషమైన సేవలను అందించారని వివరించారు. సంఘానికి విలువైన ఆస్తులనూ కూడబెట్టారిన తెలిపారు. ముందుగా రాఘవయ్య చిత్రపటం వద్ద నాయకులు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని. సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు వి.రాంబాబు, బి. రాందాస్, యం.నర్సయ్య, పి.సురేష్, వలీ, ఎన్.వీరబాబు, బి. నర్సింహారావు, జి.రాజశేఖర్, డి.శ్రీనివాస్, కె.కుటుంబరావు, కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో మహిళతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ఆర్‌టిసి బస్సులో మంత్రి పొన్నం ప్రయాణం

ప్రజాశక్తి- హైదరాబాద్‌బ్యూరో

బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆర్‌టిసి బస్సులో ప్రయాణించారు. బుధవారం హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరిన మంత్రి.. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్ గేటు వద్ద ఆగి సిద్దిపేట వైపు వెళ్తున్న కరీంనగర్ డిపో బస్సు ఎక్కారు. అక్కడి నుంచి సిద్దిపేట కలెక్టరేట్ వరకు ప్రయాణించి బస్సు దిగారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, ఆర్‌టిసి సిబ్బందితో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, విద్యార్థులతో ముచ్చటించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్‌టిసిలో అందుతున్న ఉచిత ప్రయాణంపై ఆరా తీయగా.. ప్రయాణికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఆర్‌టిసికి ప్రతినెలా ప్రభుత్వం రూ.330 కోట్లు చెల్లిస్తున్నదన్నారు. గత ప్రభుత్వం ఆర్‌టిసిని నిర్వీర్యం చేస్తే.. తాము ఆర్‌టిసిని నిలబెట్టామని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామన్నారు. దేశానికే తెలంగాణ ఆర్‌టిసి రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. విద్యార్థులకు.. బాగా చదువుకోవాలని సూచించారు. ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్‌తో.. ఆర్‌టిసి సమస్యలు పరిష్కారం చేస్తామని, జెఎసి నాయకులతో జరిగిన సమావేశంలో కూడా ఇదే విషయం చెప్పామన్నారు. సమ్మెపై వెనక్కి తగ్గి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూసినందుకు ఆర్‌టిసి ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను తొలగించిన హైడ్రా

2500 గజాల ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు చేపట్టింది. చంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ మండలం కందికల్ గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలను బుధవారం హైడ్రా తొలగించింది. 303, 306 సర్వే నెంబర్లలో 2500 గజాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. వాస్తవానికి ఈ స్థలం యూఎల్‌సీ ల్యాండ్ కాగా.. సయ్యద్ బషీరుద్దీన్, సయ్యద్ అమీదుల్లా హుస్సేన్ కబ్జా చేశారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ఉన్న భూమిని తమ పేరు మీద రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోయినా.. అందులో అనుమతులు లేకుండా షెడ్డులు, రూంలు నిర్మించారు. దాంతో ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతోందని.. కాపాడాలని స్థానికుల నుంచి ప్రజావాణికి ఫిర్యాదు అందడంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నారు. హైకోర్టు కూడా ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని రెండు నెలల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అక్కడ నిర్మించిన నాలుగు ఆర్‌సిసి రూములు, రేకుల షెడ్డులు, నాలుగు షాపులు కూల్చివేసి ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్థానిక రాజకీయ నాయకులు, కబ్జాదారులు కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసుల సహకారంతో వారిని అరెస్టు చేసి కూల్చివేతలను కొనసాగించారు.

రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమలో సిఐటియు విజయఢంకా

- 34 ఓట్ల తేడాతో బిఎంఎస్‌పై గెలుపు
- ఇది ముమ్మాటికీ కార్మికుల విజయం : చుక్క రాములు

ప్రజాశక్తి- హైదరాబాద్‌బ్యూరో

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు విజయఢంకా మోగించింది. బిఎంఎస్‌పై 34 ఓట్ల తేడాతో సిఐటియు విజయం సాధించింది. పరిశ్రమలో మొత్తం 155 ఓట్లు ఉండగా.. సిఐటియుకు 94, బిఎంఎస్‌కు 60 ఓట్లు పడ్డాయి. ఒకరు ఓటు వేయలేదు.

ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ గౌరవ అధ్యక్షులు చుక్క రాములు, యూనియన్ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ మాట్లాడారు. ఇది కార్మికుల విజయమని, పరిశ్రమలో సిఐటియుని నాలుగోసారి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికులకు హామీ ఇచ్చినట్టుగా మెరుగైన వేతన ఒప్పందంతో పాటు, మరిన్ని మంచి సంక్షేమ పథకాలు తెస్తామని.. కార్మికుల రిటైర్మెంట్ 60 ఏళ్లకు పెంచుతామన్నారు. బిఎంఎస్ కల్లబొల్లి మాటలు చెబుతూ తప్పుడు ప్రచారాలు చేసినా కార్మికులు నమ్మలేదని తెలిపారు. సిఐటియు ద్వారానే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని కార్మికులు

కార్మికుల విజయోత్సవం

మరోసారి రుజువు చేశారన్నారు. గెలిచిన అనంతరం కార్మికులందరూ నాయకులకు పూలమాలలు వేసి సత్కరించారు. టపాకాయలు కాల్చి, సీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పరిశ్రమ నుంచి గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందబోయిన ఎల్లయ్య, కామని గోపాలస్వామి, పరిశ్రమ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింలు, సాజిద్, వెంకట్రావు, శ్రీనివాస్, రంగారెడ్డి, రాజగోపాల్, ఏ.స్వామి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై నిషేధం ఎత్తివేయాలి

- మంత్రి దామోదరకు టిజిజిడిఎ వినతి

ప్రజాశక్తి- హైదరాబాద్‌బ్యూరో

బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయాలని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజిజిడిఎ) కోరింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి.నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఆర్.లాలు ప్రసాద్ రాథోడ్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ మహ్మద్ ఖాజా రవూఫుద్దీన్ తదితరులు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్, గాంధీ మెడికల్ కాలేజ్, కాకతీయ మెడికల్ కాలేజ్, నిజామాబాద్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లోని వివిధ విభాగాల్లో ఖాళీ ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు. సీనియర్ బోధనా సిబ్బంది కొరత కారణంగా వైద్య విద్య (పీజీ బోధన)తో పాటు రోగుల సేవలపై ప్రభావం పడుతున్నదని వారు తెలిపారు. ఇప్పటికే మంజూరైన పలు పోస్టులు ఇంకా భర్తీ కాకుండా మిగిలిపోయాయని చెప్పారు. అదే సమయంలో పెరిఫెరియల్ మెడికల్ కాలేజీల్లో అర్హత కలిగిన వారు బదిలీపై ఆసక్తితో ఉన్నారని చెప్పారు. ఇప్పటికే ఉన్న ఖాళీలకు బదిలీలను అనుమతించడం ద్వారా ప్రభుత్వంపై అదనంగా ఆర్థికభారం పడకుండా సిబ్బంది పెరుగుతుందని సూచించారు. ఈ బదిలీలతో ఆయా మెడికల్ కాలేజీలు బలోపేతం కావడమే కాకుండా ఆరోగ్య సంరక్షణ సేవలు మరింత మెరుగవుతాయని సూచించారు.

జూబ్లిహిల్స్‌లో 'క్రియేటర్స్ వర్స్' ప్రారంభం

హైదరాబాద్ : దేశంలోనే తొలి కంటెంట్ ఫ్యాక్టరీ అయినా క్రియేటర్ వర్స్‌ను జూబ్లిహిల్స్‌లో ప్రారంభించినట్లు ఔత్సాహికవేత్త డాక్టర్ మని పవిత్ర తెలిపారు. చిన్న వ్యాపారులకు సహాయపడేందుకు 52 స్టోరీ రూమ్స్‌తో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. చిన్న వ్యాపార యాజమానులను కంటెంట్ క్రియేటర్లుగా, ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మార్చాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని ఐఎస్‌బి పూర్వ విద్యార్థి అయినా మణి పవిత్ర తెలిపారు. లక్ష మంది యజమానులను తమ స్వంత బ్రాండ్ అంబాసిడర్లుగా, ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఒప్పో ఎఫ్ 29 సిరీస్‌కు డిమాండ్

హైదరాబాద్ : ఒప్పో ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్లకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించిందని ఒప్పో వెల్లడించింది. ఈ సరీస్‌ను లాంచ్ చేసిన కేవలం 21 రోజుల్లోనే హైదరాబాద్‌లో ఒప్పో ఎఫ్27 ప్రో ప్లస్ కన్నా 28 శాతం వృద్ధిని సాధించినట్లు తెలిపింది.

కంటెంట్‌తోనే విజయం

- ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణించొచ్చు
- హైబిజ్ టివి అవార్డుల ప్రదానోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్

మంచి కంటెంట్ ను అందించినప్పుడే ఇన్ ఫ్లూయెన్సర్స్, డిజిటల్ క్రియేటర్స్‌కు విజయం దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. చాలా మంది రకరకాల కంటెంట్ ను సృష్టిస్తుంటారని.. కానీ బాధ్యతతో అది చేసినప్పుడే వీక్షకుల్లో నమ్మకం పెరుగుతుందని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన హైబిజ్ టివి డిజిటల్ మీడియా అండ్ ఇన్ ఫ్లూయెన్సర్ అవార్డ్స్ - 2025కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నటులు శివారెడ్డి, శ్రీనాథ్ మాగంటి, గగన్ విహారి, జోగి నాయుడు, భారతి సిమెంట్ మార్కెటింగ్ డైరెక్టర్

ఎం రవీందర్ రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి రాజశేఖర్ రెడ్డి, హైబిజ్ టివి ఎండి రాజ్ గోపాల్, డాక్టర్ జె. సంధ్యారాణి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 15 మంది డిజిటల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్‌కు హై బిజ్ టివి పురస్కారాలను ఇచ్చింది. అలాగే 50 మందికి పైగా సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్స్ ను సత్కరించింది.

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మానవాళికి నష్టమే: కేసీఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పాటవానికి భారతీయుడుగా గర్వపడుతున్నానని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిజాన్ని అణచడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో ఉన్నా... ఏ దేశంలో ఉన్నా..ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించే క్రమంలో ప్రపంచ శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే శాంతి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా ఉండి దేశరక్షణకు పాటుపడాలని ఆకాక్షించారు.

సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- కరపత్రం ఆవిష్కరణలో ఎస్‌కెఎం నాయకుల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్లు టి. సాగర్, వి.ప్రభాకర్, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, నాగిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ప్రసాదన్న, విజయ్ తదితరులు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని మార్క్స్‌భవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. అంతకు ముందు సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి 15 వరకు జీపు జాతాలు, సైకిల్ మోటార్ ర్యాలీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని కోరారు. 16 నుంచి 19 వరకు గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం నాయకులు మూడ్ శోభన్, బి.రాము, డేవిడ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పై నుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాటిచెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతి చెందిన ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కొత్తూరు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పరిశాబోయిన లక్ష్మయ్య (55) రోజు మాదిరిగానే బుధవారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానికులు హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మూగజీవుల దాహం తీర్చేందుకు ట్యాంకర్ నీరు

- పాడి రైతుకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగు రైతులకే కాదు, పాడి రైతులకు కూడా వేసవికాలంలో నీటి కష్టాలు తప్పడం లేదు. వేసవికాలం కావడంతో భూగర్భ జలాలు అడు గంటిపోయి వ్యవసాయంతో పాటు మూగజీవుల దాహం తీర్చేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రానికి చెందిన రైతు మొగురం వెంకటస్వామి పశువులకు వాటర్ ట్యాంకర్‌తో నీటిని తెచ్చి దాహం తీర్చుతున్నాడు. ఇటీవల ఈదురుగాలులతో కురిసిన వర్షానికి బావి వద్ద మోటర్ కాలిపోవడంతో బోర్ పోయడం లేదని తెలిపారు. దాంతో పశువుల దాహం తీర్చేందుకు వాటర్ ట్యాంకర్ తెప్పించినట్లు తెలిపారు.

'భద్రి'లో విధ్వంసం

- అనుమతులు లేకుండానే ఐల్యాండ్ నిర్మాణం
- 70-100 ఎకరాల చెరువు కబ్జా
- పూడికతీత పనులను పెండింగ్‌లో పెట్టిన 'కుడా'
- జూన్ 15లోపు పూర్తయ్యేనా..?

ప్రజాశక్తి - హైదరాబాదట బ్యూరో

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నిర్మిస్తున్న ఐల్యాండ్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని విశ్వసనీయంగా తెలిసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన భద్రకాళి చెరువుకు వందేండ్ల చరిత్ర ఉంది. నాటి నుంచి నేటి వరకు చెరువు పూడికతీత, చెత్తాచెదారంతో నిండిపోయి ఉంది. వరదలు ఉధృతంగా వచ్చిన సందర్భాల్లో వరంగల్ నగరంపై నీరు వచ్చేది. అయినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు చెరువు పూడికతీతకు రూ.11.50 కోట్లు కేటాయించింది. వరద నివారణ పనులకు రూ.158 కోట్లు మంజూరు చేసింది. చెరువులో 1.2 మీటర్ల (తవ్వి) మేరకు పూడికను తొలగించడానికి ఈ నిధులు కేటాయించగా, చెరువు పూడిక రవాణాకు సంబంధించి డీడీల రూపంలో ఒక్క క్యూబిక్ మీటర్‌కు రూ.71.83 వసూలు చేశారు. డిడిల రూపంలో ఇప్పటికే నీటిపారుదల శాఖకు రూ.2.6 కోట్ల మేరకు నగదు జమయ్యింది. 1972లో ఈ చెరువును నీటిపారుదల శాఖ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించింది. తాజాగా ఈ పనులను చేయడం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సాధ్యం కాదని నీటిపారుదల శాఖకు అప్పగించారు. నీటిపారుదల శాఖ ఈ చెరువులో 11.50 లక్షల క్యూబిక్ మీటర్లకుగాను మూడు లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను ఇప్పటి వరకు తీయగా, 'కుడా' మూడు లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీసే పనులను చేపట్టింది. 'కుడా' ఇప్పటి వరకు రెండు లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించింది.

35 శాతం పూడికతీత పూర్తి

భద్రకాళి చెరువు పూడికతీత, వరద నివారణ పనులకు సంబంధించి ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువు పూడిక తీత 50 శాతం పూర్త య్యిందని మంత్రి 'పొంగులేటి' ప్రకటించారు. వాస్తవానికి అధికార వర్గాల సమాచారం మేరకు ఇప్పటి వరకు కేవలం 35 శాతం పూడికతీత పనులు మాత్రమే పూర్తయ్యాయి. చెరువులో 14.50 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక పేరుకుపోయింది. ఇందులో నీటిపారుదల శాఖ తీయాల్సిన 11.50 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీతలో కేవలం మూడు లక్షల క్యూబిక్ మీటర్లను మాత్రమే తొలగించారు. 'కుడా' తీయాల్సిన 3 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీతలో రెండు లక్షల క్యూబిక్ మీటర్లు తీసివేయగలిగింది. చెరువులో 1.2 మీటర్ల మేరకు తవ్వి పూడిక తీయడం ద్వారా మొత్తంగా 18 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించాలని నిర్ణయించారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే మంత్రులు మాత్రం భద్రకాళి పూడికతీత 50 శాతం పూర్తయ్యిందని, మిగతా 50 శాతాన్ని జూన్ 15వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించడం గమనార్హం.

70-100 ఎకరాల చెరువు భూములు కబ్జా

భద్రకాళి చెరువు 400 ఎకరాలకు పైగా విస్తరించి ఉండగా, నేడు చెరువు 382 ఎకరాలకు కుదించబడింది. 70-100 ఎకరాల మేరకు చెరువు భూములు కబ్జాకు గురయ్యాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు, 'కుడా' అధికారులు కలిసి ఈ చెరువులోకి మురుగు చేరొద్దని నిర్మిం చిన కట్టతో కబ్జాలకు లైసెన్స్ ఇచ్చినట్టయ్యింది. దాంతో పెద్ద ఎత్తున కబ్జాదారులు చెరువు భూములను కబ్జా చేసి అక్రమంగా డాక్యు మెంట్లను సృష్టించి విచ్చలవిడిగా భవనాలను నిర్మించారు.

ఐల్యాండ్ నిర్మాణానికి అనుమతులేవీ..?

భద్రకాళి చెరువులో 'కుడా' అధికారులు ఐల్యాండ్‌ను నిర్మిస్తున్నారు. ఈ ఐల్యాండ్ నిర్మాణానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గాని, నీటిపారుదల శాఖ నుంచి గాని అనుమతులు తీసుకోలేదు. భద్రకాళి చెరువులో

పూడిక తీయడానికి రూ.11.50 కోట్లను ఒకవైపు ఖర్చు పెడుతుండగా, మరోవైపు చెరువు మధ్యలో ఐల్యాండ్ నిర్మించడానికి మట్టిని గుట్టగా 'కుడా' పేర్చుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే చెరువు విస్తీర్ణం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో 'కుడా' చేస్తున్న పనులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భద్రకాళి చెరువు 2010-11 నుంచి పెద్ద ఎత్తున కబ్జాలకు గురైందన్న ఆరోపణలున్నాయి. 70-100 ఎకరాల చెరువు భూమి కబ్జాకు గురైన నేపథ్యంలో తాజాగా చేపడుతున్న పనులు సైతం చెరువు విస్తీర్ణాన్ని తగ్గించడం పట్ల నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పది రోజులుగా పూడికతీత పెండింగ్..

భద్రకాళి చెరువులో పూడిక తీత పనులు పది రోజులుగా నిలిచిపోయాయి. మంత్రులు వచ్చిన సందర్భంలోనూ పూడికతీత పనులు నిలిచిపోయాయి. ఒకవైపు ఎండాకాలం ముగుస్తుండటంతో పూడికతీత పనులు పూర్తికాకపోతే వర్షాలు పడితే చెరువులోకి వాహనాలు పోవడం, పూడిక తీయడం సాధ్యం కాని పని. పూడిక మట్టిని తీసుకు పోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో సోమవారం నీటిపారుదల శాఖ రూ.14.13 కోట్ల అంచనా వ్యయంతో ఆన్‌లైన్ టెండర్‌లకు ఆహ్వానం పలికింది. వచ్చే సోమవారం ఈ టెండర్‌కు తుది గడువు ముగియనుంది. అప్పటి వరకు చెరువులో పూడిక తీత పనులు నిలిచిపోయినట్టే.

'భద్రి'లో ఆక్రమణలు వద్దు..
: పుల్లూరి సుధాకర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్

భద్రకాళి చెరువులో కబ్జాలు అధికమై వందల ఎకరాల చెరువు కుదించుకుపోయిన నేపథ్యంలో మళ్లీ అభివృద్ధి పేరిట చెరువు విస్తీర్ణాన్ని మరింత తగ్గించడం సరైన నిర్ణయం కాదు. చెరువు మధ్యలో ఎలాంటి నిర్మాణాలకూ అనుమతులు ఇవ్వకూడదు. ఉన్న చెరువుల విస్తీర్ణాన్ని కూడా కాపాడుకోలేకపోతే భవిష్యత్ తరాలు క్షమించవు.

పుప్పాలగూడలోని అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

- కొరియోగ్రాఫర్ కోరేటి రవీందర్‌రెడ్డి మృతి

ప్రజాశక్తి- హైదరాబాద్‌బ్యూరో

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ శ్రీనగర్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కొరియోగ్రాఫర్ కోరేటి రవీందర్‌రెడ్డి (38) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరెటి రవీందర్‌రెడ్డి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ఆయన అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తు 301లో ఉంటున్నారు. మంగళవారం రాత్రి అతని గదిలోని ఏసీ నుంచి మంటలు వ్యాపించాయి. షార్ట్ సర్క్యూట్‌తో ఆ మంటలు వ్యాపించి, పెద్ద మొత్తంలో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. నార్సింగి పోలీసులు ప్రమాదం చోటుకి చేరుకుని రవీందర్‌రెడ్డిని బయటకు తీసే ప్రయత్నం చేయగా, అప్పటికే ఆయన మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య విజయ, పిల్లలు మౌతిక, నిశాంత్‌రెడ్డి ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు పూర్తి మద్దతు

- దేశ భద్రత అన్నింటికంటే ముఖ్యం : వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అణచడానికి భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు బీఆర్‌ఎస్ పూర్తి మద్దతిస్తుందని ఆ పార్టీ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్‌కు కూడా తమ పార్టీ మద్దతిచ్చిందని గుర్తు చేశారు. రాజకీయాలకంటే దేశ భద్రతే అన్నిటి కన్నా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. పాక్ ప్రతిదాడులను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతుందనే నమ్మకముందని పేర్కొన్నారు. ఏపీలో కోరుకొండ, పులివెందుల, కలికిరిలో సైనిక్ స్కూళ్లు ఉన్నాయనీ, తెలంగాణ ప్రాంతంలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే అప్పటి సీఎం కేసీఆర్ సైనిక్ పాఠశాలల ఏర్పాటు కోసం కేంద్రం పై ఒత్తిడి తెచ్చారని గుర్తు చేశారు. అయినా మోడీ సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్రం నుంచి గెలుపొందిన 8 మంది బిజెపి ఎంపిలు సైనిక స్కూళ్ల ఏర్పాటు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. ఏపీలోని సైనిక స్కూళ్లలో తెలంగాణ విద్యార్థుల రిజర్వేషన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, బిఆర్‌ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.